

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి
టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేశ్‌బాబు 7

నూతన విద్యావిధానం రద్దు కోసం ఉద్యమించాలి
ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి 7

రాష్ట్ర ప్రభుత్వానికి అనుభవ రాహిత్యం

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



మానకొండూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

మానకొండూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుభవ రాహిత్యంతో పాలన కొనసాగిస్తోందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మానకొండూర్‌కు వచ్చిన ఆయన స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుభవ, అవగాహన, అహంకారంతో పరిపాలన చేస్తుందే తప్ప ప్రజా సంక్షేమానికి పాటుపడటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఆరు గ్యారంటీలతో 420 హామీలతో అధికారం చేపట్టిందని వాటికి ఎంత డబ్బు అవసరం ఉంటుందో రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, 20వేల మెగావాట్ల విద్యుత్, మూసీ నది సుందరీకరణ లాంటి పథకాలను ఏ విధంగా పూర్తి చేస్తారో చెప్పాలన్నారు. అంతేకాకుండా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేని రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు.

రాష్ట్ర అభివృద్ధి కోసమే రాజకీయాలు చేయాలని ప్రజలను మోసం చేయవద్దన్నారు. ఒక్క ఓటుకు రెండు రాష్ట్రాలు ఇస్తామని బీజేపీ మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేదో తెలియజేయాలన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. అభివృద్ధి కోసం ఏ ప్రభుత్వమైనా అప్పులు చేయాల్సిందేనని, అప్పులపై రాష్ట్ర ప్రభుత్వానికి అవగాహన లేదన్నారు. అభివృద్ధి కోసం అన్ని పార్టీలతో కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, శాతరాజు యాదగిరి, దండబోయిన శేఖర్ ఉన్నారు.

మున్సిపాలిటీల్లో చురుగ్గా సర్వే



- కరీంనగర్, కొత్తపల్లి, చొప్పదండిలో నూరు శాతం పూర్తి
- హుజూరాబాద్, జమ్మికుంటలో తుది దశలో...
- 21,22 తేదీల్లో వార్డు సభలు

కరీంనగర్ టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల సర్వే చురుగ్గా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 20వ తేదీలోగా సర్వే పూర్తి చేసి 21, 22 తేదీల్లో వార్డు సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు కొత్తపల్లి, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో గురువారం సర్వేను ప్రారంభించి ముమ్మరంగా చేపడుతున్నారు.

కరీంనగర్, కొత్తపల్లి, చొప్పదండి మున్సిపాలిటీల్లో శుక్రవారం సర్వే పూర్తి చేయగా, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీల్లో తుది దశకు చేరుకుంది. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల్లో ఆధార్‌కార్డులు ఉన్న వాటితో సర్వే ప్రక్రియ చేపట్టారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో 43,000 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వివరాలను సేకరించారు. అలాగే 3,800 మంది కొత్త రేషన్‌కార్డుల కోసం చేసిన దరఖాస్తుల సర్వే కూడా పూర్తయింది. నూరుశాతం సర్వే పూర్తికావడంతో ఈ నెల 21న నగరంలోని 60 డివిజన్లలో వార్డు సభలను నిర్వహించేందుకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో 60 డివిజన్లలో నిర్వహించే వార్డు సభల్లో అర్హులైన వారి జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తారు.

- కొత్తపల్లి మున్సిపాలిటీలో 50 ఇందిరమ్మ ఇళ్లు, 193 రేషన్ కార్డుల సర్వే ప్రక్రియ పూర్తికావడంతో 21,22 తేదీల్లో వార్డు సభలను నిర్వహించనున్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో 534 రేషన్‌కార్డుల దరఖాస్తుల్లో 448 పరిశీలన పూర్తికాగా 86 దరఖాస్తుల సర్వేను ఒకటిరెండు రోజుల్లో పూర్తిచేసి 21,22 తేదీల్లో వార్డు సభలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇక ఇందిరమ్మ ఇళ్ళ సర్వే కూడా దాదాపు పూర్తయినట్లు చెబుతున్నారు.
- జమ్మికుంట మున్సిపాలిటీలో 7,000 ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేశారు. 646 రేషన్‌కార్డుల దరఖాస్తుల్లో 355 దరఖాస్తుల సర్వే పూర్తికాగా, మరో 291 పరిశీలించాల్సి ఉందని, వాటిని త్వరితగతిన పూర్తిచేసి 21,22 తేదీల్లో వార్డు సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- చొప్పదండి మున్సిపాలిటీలో 312 మంది ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా వాటి సర్వే పూర్తయింది. ఇందిరమ్మ ఇళ్ల సర్వే కూడా దాదాపు పూర్తయినట్లేనని చెబుతున్నారు. ఇక్కడ కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు

మిగతా 8వ పేజీలో



అర్హత ఉన్న ప్రతి వ్యక్తికి రేషన్ కార్డు

- పాత రేషన్ కార్డులు తొలగించం
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అర్హతలు ఉన్న ప్రతి వ్యక్తికి రేషన్ కార్డులు అందిస్తామని రాష్ట్ర రవాణాశాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎట్టి పరిస్థితిల్లో పాత రేషన్ కార్డులు తొలగించమని అన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల నిర్వహించిన కుల సర్వే ఆధారంగా ఉన్న సమాచారం మేరకు అన్ని వర్గాల ప్రజలకు రేషన్ కార్డులు ఇస్తామన్నారు.



ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 2 లక్షల రుణ మాఫీ చేసినట్లు తెలిపారు. జనవరి 26 నుంచి రైతు భరోసా, భూమిలేని రైతు కూలీలకు 12 వేలు ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో కొత్త మండలాలు ఏర్పడినప్పుడు ఇందుర్తి మండలంగా ఏర్పడుతుందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, నాయకులు, చిట్టుమల్ల రవీందర్, ఐరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల



- కరీంనగర్ కార్పొరేషన్‌కు 49.2 కోట్లు, కొత్తపల్లి మున్సిపాలిటీకి 2 కోట్లు
- స్టాంపు డ్యూటీ, పట్టణ ప్రగతి నిధులతో ఊరట
- నెలాఖరుతో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం

కరీంనగర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మున్సిపాలిటీలకు నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెలాఖరుతో మున్సిపాలిటీల పాలకవర్గ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్టాంపు డ్యూటీ నిధులను విడుదల చేసింది. నగరపాలక సంస్థలకు పట్టణ ప్రగతి పెండింగ్‌లో ఉన్నవాటిలో కొంత మొత్తాన్ని విడుదల చేసి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఊరట కలిగించింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు 47 కోట్ల రూపాయల స్టాంపు డ్యూటీ నిధులు విడుదల కాగా వాటితో పెం డింగ్‌లో ఉ న్న విద్యుత్



బిల్లుల బకాయిలు, జీతభత్యాల చెల్లింపులు, ఇతర అత్యవసర చెల్లింపులు చేయాలని, మిగిలిన నిధుల వినియోగానికి త్వరలోనే నిబంధనలను విడుదల చేస్తామని పేర్కొంది. అలాగే పట్టణ ప్రగతి నిధులు 2 కోట్ల 20 లక్షలను కూడా విడుదల చేసింది. పట్టణ ప్రగతిలో చేపట్టిన 12 కోట్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కాంట్రాక్టర్లు కొత్తగా పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు.

పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు నగరపాలక సంస్థలో నిధులు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అనేక పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 47 కోట్లు స్టాంపు డ్యూటీ, 2.20 కోట్ల పట్టణ ప్రగతి నిధులను విడుదల చేయడం కొంత ఊరట కలిగించే విషయం. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పట్టణ ప్రగతి నిధులు పూర్తిగా నిలిపివేయడంతో పట్టణ ప్రగతి నిధులతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీల వంటి అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచి పోవడంతో దాదాపు ఏడాది నుంచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు కనీసం 200 కోట్ల రూపాయలు ఇవ్వాలంటూ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

ఈ నేపథ్యంలో 49.2 కోట్లు ప్రభుత్వం ఇవ్వడంతో కొన్ని పనులైనా పూర్తవుతాయని అంటున్నారు. ఇక కొత్తపల్లి మున్సిపాలిటీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం 2 కోట్ల 20 లక్షల స్టాంపు డ్యూటీ నిధులు విడుదల చేసింది. జనరల్ ఫండ్ లేక సతమతమవుతున్న చిన్న మున్సిపాలిటీలకు స్టాంపు డ్యూటీ నిధులు మేలు చేస్తాయని భావిస్తున్నారు.

అలాగే జిల్లాలోని చొప్పదండి, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు కూడా స్టాంపు డ్యూటీ నిధులు విడుదలైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈనెలాఖరుతో పాలకవర్గ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తుండగా ఏడాది నుంచి ఒక్క రూపాయి ఇవ్వకుండా ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే స్టాంపు డ్యూటీ నిధులు విడుదల చేసిందని, ఆ నిధులు పెండింగ్ విద్యుత్ బిల్లులు, వేతన బకాయిలకే సరిపోతాయని ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా గడ్డం విలాస్‌రెడ్డి

13 మందితో పర్సన్ ఇన్‌చార్జి కమిటీ నియామకం

కరీంనగర్ టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ది కరీంనగర్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం విలాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు బ్యాంకు చైర్మన్‌తో పాటు మరో 12 మందితో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమిస్తూ నియామక ఉత్తర్వులను ఈ నెల 15న జీవో ఆర్‌టి నెంబర్.21ని జారీ చేశారు.

శుక్రవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు నియామక ఉత్తర్వులను అందుకున్నారు. విలాస్‌రెడ్డి చైర్మన్‌గా, సభ్యులుగా మడుపు మోహన్, ముక్క భాస్కర్, బొమ్మరాతి సాయికృష్ణ, ముద్దసాని క్రాంతి, రేగొండ సందీప్, మూల లక్ష్మి, ఎ.విద్యాసాగర్, ఇ.లక్ష్మన్‌రాజు, ఎండీ సమియొద్దీన్, మంగి రవీందర్, నాగుల సతీష్, మార్క రాజు నియమితులయ్యారు. ఆరు మాసాల పదవీ కాలం లేదా ఎన్నికలు జరిగే వరకు ఈ కమిటీ కొన సాగుతుందని పేర్కొన్నారు. ఎన్నికైన కమిటీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డితో పాటు సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందిస్తూ బ్యాంకును మరింత అభివృద్ధి చేస్తూ ఖాతాదారులకు, ప్రజలకు మెరుగైన సేవలందించేలా కృషి చేయాలని సూచించారు. క్రియాశీల కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి 2005లో సిటీ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, డీసీసీ కార్యవర్గ సభ్యుడిగా, 2009 నుంచి 2024 వరకు డీసీసీ అధికార ప్రతినిధిగా, 2010,2011లో వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన పార్టీ అధిష్టానం బ్యాంకు చైర్మన్‌గా అవకాశం కల్పించడం సంతోషాన్ని కలిగించిందని విలాస్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ గుర్తించి అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి బ్యాంకు అభివృద్ధికి పాటుపడతానని, తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, సభ్యులు

ఆరోగ్య మహిళపై విస్తృత ప్రచారం చేయాలి

- క్యాంపులు నిర్వహించి 100 శాతం పరీక్షలు పూర్తి చేయాలి
- వైద్యాధికారుల సమీక్షలో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య మహిళ కార్యక్రమం గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి నూరు శాతం మంది మహిళలకు వైద్య పరీక్షలు పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్డుల్లో, గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. క్యాంపులో మహిళా ఆరోగ్య సిబ్బంది ఉండేటట్లు చూసుకోవాలని అన్నారు. బీపీ, షుగర్ నియంత్రణకు సంబంధించిన అన్ని మందులు ప్రభుత్వాసుపత్రిల్లో ఉంటాయన్న విషయం చాలామందికి తెలియదన్నారు. ప్రభుత్వాసుపత్రిలో లభించే మందుల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. మొదటి కాన్పులో సాధారణ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

పోషకాహార లోపాన్ని దూరం చేయాలి

హుజూరాబాద్ రూరల్: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వాలు చర్య లు చేపడుతున్నాయని, చిన్నారుల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలో శుక్రవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను బోధిస్తున్నామని, చిన్నారులను కేంద్రాలకు పంపించాలని తల్లులకు సూచించారు. చెల్పూర్ సెక్టార్ పరిధిలో కొంతమంది చిన్నారులు పోషకాహార లోపంతో ఉన్నారని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం ఇళ్లకు తీసుకెళ్లకుండా అక్కడే తినాలని లబ్ధిదారులకు సూచించారు. మహిళలు విధిగా ఆరు నెలలకొకసారి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి సబిత మాట్లాడుతూ ఇంద్ర ధనస్సులో ఏడు రంగుల మాదిరి మన ప్లేట్‌లో ఏడు రకాల ఆహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేష్‌బాబు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత ఉన్నారు.



సింగాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● క్షేత్ర స్థాయిలో పరిశీలించి నమోదు చేయాలి

మండలంలోని సింగాపూర్, బోర్నపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీ, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సర్వేను కలెక్టర్ పరిశీలించారు. గడువులోగా ప్రక్రియ పూర్తి చేసి గ్రామ సభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

నిమ్మకాయ తెచ్చిన తంటా

● ఇరువర్గాల మధ్య ఘర్షణ ● 16మందిపై కేసు నమోదు

మల్యాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం అనంతరం దిగువ కొండగట్టులో వన భోజనాలలో భాగంగా విందు చేసుకుంటున్న రెండు వర్గాల మధ్య నిమ్మకాయ విషయంలో జరిగిన గొడవలో 16మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. వేములవాడకు చెందిన ఈర్లపల్లి గౌతమి కుటుంబసభ్యులు, జమ్మి కుంటకు చెందిన పల్లపు మధూకర్ మరికొందరు వేర్వేరుగా శుక్రవారం కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం దిగువ కొండగట్టులో చెట్ల కింద పక్కపక్కనే విందు భోజనాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక వర్గానికి చెందిన వారు భోజనం చేస్తూ పక్కన గల మరోవర్గం వారిని నిమ్మకాయ అడిగారు. అయితే నిమ్మకాయలు తక్కువ ఉన్నాయని, తమకు సరిపోవని చెప్పే క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ దాడులకు దారి తీసింది. అనంతరం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలకు చెందిన 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

చికిత్స పొందుతూ మహిళ మృతి

చొప్పదండి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన నాంపల్లి సూరవ్వ(55) అనే మహిళ శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై అనూష తెలిపిన వివరాల ప్రకారం.. సూరవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది గురువారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సూరవ్వ శుక్రవారం మృతి చెందింది. సూరవ్వ కుమారుడు నాంపల్లి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దపల్లి మండలంలో వృద్ధుడు..

పెద్దపల్లి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుగొండ గ్రామ పంచాయతీ అనుబంధ జగన్నాథపురం గ్రామానికి చెందిన బుర్ర ఎల్లయ్య(70) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు మల్లయ్య వృత్తిరీత్యా గీత కార్మికుడని, కొన్ని రోజుల క్రితం చెట్టుపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. దీంతో ఇంటికే పరిమితమైన మల్లయ్య జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



కాలిపోయిన ఫ్రిడ్జి

సుల్తానాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుతినగర్‌లోని ఓ ఇంట్లో అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లో ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, సామగ్రి కాలిబూడిదయ్యాయి. మారుతినగర్‌లో గూడ ఉలియమ్మ, ఓదెలు దంపతులు నివసిస్తున్న ఇంట్లో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో అతికష్టం మీద వృద్ధ దంపతులు బయటకు వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు. అప్పటికే పొగ పీల్చిన వలియమ్మ స్పృహతప్పి పడిపోయింది. మంటలకు ఇంట్లోని ఫ్రిడ్జి, టీవీ ఇతర సామగ్రి కాలిపోయాయి. సమీప ప్రాంత ప్రజలు వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ ప్రమా దంలో దాదాపు రెండు లక్షల నష్టం జరిగిందని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఓదెల దేవస్థానం కమిటీ మాజీ డైరెక్టర్ కర్రె కుమారస్వామి అధికారులను కోరారు.

● సిమ్స్ కళాశాలలో పీజీ కోర్సుల కోసం ఎదురుచూపులు

● జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు అధికారుల దరఖాస్తు

అనుమతిపై ఉత్కంఠ



కళ్యాణ్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో బోధన తరగతులు ప్రారంభమై మూడు సంవత్సరాలు కావస్తుంది. ఈ ఏడాది కళాశాలలో పీజీ కోర్సులకు దరఖాస్తు చేశారు. ఆరు విభాగాల కోర్సులకు జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు దరఖాస్తు చేశారు. పీజీ కౌన్సిలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఆరు విభాగాల్లో 24సీట్లు మంజూరవుతాయని భావించినా ఇప్పటి వరకు దీనిపై స్పష్టత రాలేదు. జాతీయ వైద్య విద్యా కమిషన్ మెడికల్ కళాశాలను సందర్శించిన అనంతరం ఇక్కడి వసతులను బట్టి పీజీ కోర్సులకు అనుమతులు ఇవ్వనున్నారు. ఈ సీట్ల కోసం ప్రభుత్వం తరఫున సుమారు రూ.96లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. దీనిపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పీజీ కోర్సులపై నివేదికను కూడా పంపారు. డీఎంఈ కార్యాలయం నుంచి నివేదిక కూడా పంపారు. ప్రభుత్వం తరఫున పీజీ కోర్సులకు డిపాజిట్ చేయడానికి కూడా సుముఖతతో ఉంది.

● ఆరు పీజీ కోర్సులకు దరఖాస్తు..

ఎంబీబీఎస్ 4వ సంవత్సరం మొదలు కాగానే విద్యార్థులు పీజీ కోర్సుల కోసం పోటీ పడుతుంటారు. పీజీ కోర్సుల్లో ఫ్రీ సీటు వస్తే విద్యార్థులకు ఎంతో లాభం చేకూరుతుంది. ఇందుకోసం గాను ఈ ఏడాది ఎమర్జెన్సీ మెడిసిన్, నాలుగు సీట్లు, ఆర్థో నాలుగు సీట్లు, గైనకాలజీ నాలుగు సీట్లు, పిడియాట్రిక్ నాలుగు సీట్లు, జనరల్ మెడిసన్, జనరల్ సర్జరీ నాలుగు సీట్లు మొత్తం 24సీట్ల కోసం జాతీయ వైద్య విద్యా కమిషన్‌కు దరఖాస్తు చేశారు. ఇందులో సీట్లు మంజూరైతే ఇక్కడ మరింత వైద్య విద్యార్థులకు ఉన్నత విద్య లభించనున్నది.

● 2022-23లో ప్రారంభం..

రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సంస్థ నిధుల నుంచి రూ.520కోట్లను కేటాయించారు. ఏడాదిలోపే భవన నిర్మాణాలను పూర్తిచేసి 2022-23లో వైద్య విద్యను ప్రారంభించారు. 150సీట్లతో మొదటి సంవత్సరం బోధన తరగతులు ప్రారంభించారు. ఇందులో సింగరేణి కార్మికుల పిల్లల కోసం 7శాతం, జాతీయ కోటాలో 15శాతం, 128సీట్లు రాష్ట్ర కోటా నుంచి భర్తీ అయ్యాయి. రామగుండంలో నిర్మించిన మెడికల్ కళాశాలలో అన్ని వసతులు ఉండడంతో ఇక్కడ చేరడానికి విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది కూడా సింగరేణి మెడికల్ కళాశాలలో సీటు పొందడానికి విద్యార్థులు పోటీ పడ్డారు.

అనుమతుల కోసం వేచి చూస్తున్నాం..

- హిమబిందు, సిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్



పీజీ కోర్సుల అనుమతి కోసం వేచి చూస్తున్నాం. గత ఏడాదిలోనే ఆర్థో, ఎమర్జెన్సీ మెడిసిన్, ఆర్థో, గైనకాలజీ, పిడియాట్రిక్, జనరల్ సర్జన్ విభాగాల పీజీ కోర్సుల కోసం నివేదిక పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే క్లాసులను ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. పీజీ కోర్సులు వస్తే ప్రతి అదనంగా సిమ్స్ కళాశాలలో ఏటా 24 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు పెరుగుతాయి.

స్వాతంత్ర్య సమరయోధుడు మృతి



రంగారావు(ఫైల్)

సుల్తానాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు రంగారావు(90) శుక్రవారం మృతి చెందారు. నైజాం, రజాకార్ల అరాచకాలను ఎండగట్టడంలో, స్వాతంత్ర్య సమర యోధులతో కలిసి పోరాటాలు చేయడంలో రంగారావు ముందుండేవారని గ్రామస్థులు తెలిపారు. రంగారావు మృతిపై పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య సంతాపం తెలిపారు. సుద్దాల గ్రామంలోని రంగారావు నివాసాని కి వచ్చి ఆయన భౌతికకాయంపై జాతీయ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు తదితరులు నివాళులర్పించారు.

స్తంభానికి ఢీకొట్టిన కారు ఆర్‌ఎంపీ మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలోని గాంధీనగర్ వద్ద కరీంనగర్-రాజన్నసిరిసిల్ల రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ ఓరుగంటి రాంచంద్రం(63) మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బావుపేటకు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పనిచేస్తున్న రాంచంద్రం శుక్రవారం ఉదయం బావుపేట నుంచి కరీంనగర్‌కు తన కారులో వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టాడు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడడంతో రాంచంద్రం అక్కడికక్కడే మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

మెట్‌పల్లి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలతపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు శుక్రవారం గురుకులాల కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గురుకులంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఓంకారి అఖిల్ 2024 డిసెంబర్ 18న పాము కాటుకు గురయ్యాడు. 19న మరో విద్యార్థి బోడ యశ్వంత్ అస్వస్థతకు గురయ్యాడు. 24గంటల వ్యవధిలోనే ఇద్దరు అస్వస్థత బారిన పడి ఘటన చర్యల్లో భాగంగా ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. గురుకుల నిర్వహణలో ప్రిన్సిపాల్ మాధవీలత నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారుల విచారణలో తేలడంతో జిల్లా కలెక్టర్ డిసెంబర్ 19న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వచ్చే వరకు గురుకుల ఉపాధ్యాయుడైన షైపాల్‌రెడ్డికి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. గురుకులాల కార్యదర్శి విచారణ అనంతరం ప్రిన్సిపాల్‌పై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తూ యధావిధిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు

మానకొండూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఊరడి ఎల్లయ్య (45), ఊరడి రవి (42)లు వ్యక్తి గత పనిపై బైక్‌పై మానకొండూర్‌కు వెళ్లారు. తిరిగి రాఘవాపూర్ వెళుతూ వెల్ది రోడ్డు పక్కన బైక్ నిలిపారు. ఆ సమయంలో అన్నారం నుంచి కరీంనగర్‌కు వెళుతున్న కారు ఆగి ఉన్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఎల్లయ్య, రవికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారికి కరీంనగర్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తర లిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దారి దోపిడీ దొంగల పట్టివేత

» నిందితుల నుంచి నగదుతో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం

» వివరాలు వెల్లడించిన పోలీసులు

జగిత్యాల క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కూలి పని చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఒకరిని అడ్డగించి దారి దోపిడి చేసిన ఇద్దరు దొంగలను సాంకేతిక పరిజ్ఞానంతో 10 గంటల లోపే జగిత్యాల పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘు చందర్ విలేకరుల సమావేశం నిర్వహించి నిందితులను అరెస్టు చూపించి పూర్తి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన దుర్గం సాయి బాబా అనే వ్యక్తి ఉపాధి కోసం జగిత్యాల జిల్లా కేంద్రానికి వలస వచ్చి గోవిందు పల్లిలో నివాసం ఉంటున్నాడు. గురువారం కూలీ పను లు ముగించుకుని రాత్రి సమయంలో ఇంటికి వెళుతున్నాడు. ఈ క్ర మంలో బైపాస్ రోడ్‌లో సాయిబాబాను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీపై వచ్చి అడ్డగించి దాడి చేసి రూ. 2,800 నగదుతో పాటు రూ. 3 వేల విలువగల సెల్ ఫోన్‌ను అప హరించుకు వెళ్లారు. బాధితుడు తేరుకుని టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దోపిడీకి పాల్పడిన నిందితులు ఇద్దరిని మంచినీళ్ల బావి ప్రాంతంలో శుక్రవారం ఉదయం పట్టుకున్నారు. ఇద్దరు నిందితులు పట్టణంలోని పురాణీపేటకు చెందిన పోచంపెల్లి శంకర్, జగిత్యాల రూరల్ మండలం బాలెప ల్లికి చెందిన సిరికొండ నరేష్‌గా గుర్తించి వారి వద్ద స్కూటీతో పాటు దోపిడీ చేసిన నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ వేణు గోపాల్, ఎస్సైలు మన్మధ రావు, గీత సిబ్బంది పాల్గొన్నారు.

● ద్విచక్ర వాహనాల చోరీ..

జగిత్యాలతో జిల్లా కేంద్రంలో ఇటీవల ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన దొంగను జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ విలేకరుల స మా వేశం నిర్వహించి నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని చిన్న కెనాల్ సమీపంలో శుక్రవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నెంబరు ప్లేట్ లేని వాహనంపై అనుమానాస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డాడు. విచారణలో పట్టణంలోని కృష్ణానగర్, కరీంనగర్ రోడ్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో నిలిపి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసినట్లుగా గుర్తించారు. నిందితుడిని జిల్లా కేంద్రంలోని చిలుకవాడకు చెందిన అమేర్‌గా గుర్తించి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాం డ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ వేణు గోపాల్, ఎస్సైలు మన్మధరావు, గీత పా ల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

గ్యాస్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

కరీంనగర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇండేన్ డీలర్లు తమగ్యాస్ వాడకం దారులకు మెరుగైన సేవలు అందించాలని ఇండియన్ కార్పోరేషన్ తెలంగాణ, ఆంధ్రా (టాప్స్) విక్రయ విభాగం సీనియర్ అధికారి కెకీర్తి అన్నారు. శుక్రవారం నగరంలోని ఓప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ సేల్స్ ఏరియా-1 ఇండేన్ గ్యాస్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి చివరి నాటికి విధిగా సురక్ష రబ్బరు ట్యూబ్ మార్చుకునే విధంగా కస్టమర్లు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎల్‌పీజీ డీలర్ అంబుజా గ్యాస్ ఏజన్సీ అధినేత పీవీ మదన్‌మోహన్, సుభాష్‌రావు, రాధాక్రిష్ణ, ప్రవీణ్, శ్రీధర్, రాజయ్య, అమరీష్, రాము, హన్మంత్‌పటేల్, వెంగళరావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంపై దాడి కేసులో

పలువురికి జైలు శిక్ష

కోనరావుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయంపై దాడి కేసులో నిందితులకు ప్రిన్సిపల్ జిల్లా సెషన్ జడ్జి ప్రేమలత జైలు శిక్ష విధించినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. నిమ్మపల్లికి చెందిన ఉప్పర కులస్తులు జవ్వాజి పూజ, జవ్వాజి విమల, చంద్రకళ, మేదరి దేవయ్య, బండ రాజయ్య, బండ సత్తయ్య, పూజ్యం రాజయ్య, గంగాధర్, పూజం లింగయ్య, రెడ్డిమల్ల లచ్చయ్య, మ్యాదరి మధు, జవ్వాజి గంగాధర్ 19 మార్చి 2017 రోజున కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. దీనిపై అప్పటి తహసీల్దార్ నాగరాజమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. 2023 నవంబరులో కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ జిల్లా కోర్టులో అప్పీల్ చేయగా జిల్లా న్యాయమూర్తి అప్పీల్‌ను తిరస్కరించి ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

కరీనగర్ టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా పదోన్నతిపై మహ్మద్ రషీద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హుజూరాబాద్ డివిజన్‌లో సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు కరీంనగర్ ఏడీగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డబుల్ రోడ్డు కోసం మహా పాదయాత్ర

గంభీరావుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామస్థులు డబుల్ రోడ్డు కోసం మరోసారి నడుం బిగించారు. గతంలో డబుల్ రోడ్డు కోసం ఆందోళనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టారు. తాజా మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. కొత్తపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి శివాజీనగర్ గ్రామ సరిహద్దు వరకు నాలుగు కిలో మీటర్ల డబుల్ రోడ్డు కోసం శుక్రవారం మహా పాదయాత్ర చేపట్టారు. కొత్తపల్లి గ్రామంలో పాదయాత్ర ప్రారంభంలో గంగిరెద్దుకు వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపారు. కొత్తపల్లి గ్రామం నుంచి గంభీరావుపేట తహసీల్దార్ కార్యాలయం వరకు దాదాపు 10 కిలో మీటర్ల వరకు మహా పాదయాత్ర కొనసాగింది. వెంటనే కొత్తపల్లిలో డబుల్ రోడ్డు మంజూరు చేయాలని, పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొత్తపల్లి ఎల్లమ్మ నుంచి శివాజీనగర్ గ్రామ శివారు వరకు రోడ్డు గుంతలమయంగా మారిందని, బస్సులు పూర్తి స్థాయిలో నడవడం లేదని వాపోయారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే వాహనాలు రావడం లేదని, ఉన్నత చదవుల కోసం వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డబుల్ రోడ్డు నిర్మాణం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం తహ సీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణకాంత్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శివసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌటే గణేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పర్శాగౌడ్, శ్రావణ్, రాజుగౌడ్, మహేష్, పోశెట్టి, అవినాష్, రఘు, సాగర్, రమేష్, ప్రవీణ్, వెంకటి, కిష్టయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వస్తున్న నాయకులు, ప్రజలు

అభివృద్ధి పనులు వేగవంతం

» రోడ్డు, వంతెనలు, ప్రాజెక్టులకు మోక్షం

కథలాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఖజానా నిండుకోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిపి వేసి చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు రెండేళ్ల అనంతరం పనుల కొనసాగిస్తున్నారు. కోట్లాది రూపాయల బిల్లులు రాక పని ప్రదేశాల వద్ద సామగ్రి వదిలి వెళ్లిన వారు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జోక్యం, హామీతో అర్ధంతరంగా నిలిపి వేసిన పనులను పూర్తి చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో కథలాపూర్ మండ లంలోని అనేక గ్రామాల్లో పనులు చకాచకా సాగుతున్నాయి.



కొనసాగుతున్న సూరమ్మ మత్తడి పనులు

● ఆరేళ్ల క్రితం శంకుస్థాపన..

తక్కళ్లపల్లి - సిరికొండ వంతెనకు ఆరేళ్ల కిందట శంకుస్థాపన చేయగా కాంట్రాక్టర్ 70 శాతం పనులు పూర్తి చేసి రెండు సంవత్సరాల కిందట స్టీలు, కాంక్రీట్, సిమెంట్ ఇతరత్రా సామగ్రి వదిలేసి వెళ్లాడు. ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్ రద్దు చేయగా ఎమ్మెల్యే జోక్యంతో పునరుద్ధరించడంతో వంతెన పనులు జోరుగా సాగుతున్నాయి. అంబారిపేట వయా కొచ్చెగుట్ట తండా నుంచి రుద్రంగి దాకా బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ పథకం కింద రూ. 3 కోట్లు మం జూ రు కాగా టెండర్ వేసిన కాంట్రాక్టర్ బిల్లులు రావనే భయంతో ముందుకు రాలేదు. ప్రస్తుతం ఆ పనులు ఊపందుకున్నాయి. అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనానికి రెండేళ్ల కిందట 15వ ఆర్థిక సంఘం రూ. 1.56 కోట్లు మంజూరు చేయగా కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఏడాదిగా నిలిపి వేశాడు. ఎట్టకేలకు కాంట్రాక్టర్‌ను ఒప్పించడంతో పనులు జరుగుతున్నాయి. సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ మత్తడి, కట్ట పనులు చందుర్తి మండలానికి చెందిన ఓ సబ్‌కాంట్రాక్టర్ మూడేళ్ల కిందట బిల్లుల సమస్యతో నిలిపి వేయగా కొత్త సబ్‌కాంట్రా క్టర్‌తో దాదాపు రూ.6 కోట్ల పనులను వేగవంతంగా చేపడుతున్నారు. రాళ్లవా గు ప్రాజెక్ట్ కుడి కాలువ తెగిపోగా మరమ్మ తులకుగాను కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక రూ. 21 లక్షలు కేటాయించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టర్‌ను ఒప్పించి పనులు పూర్తి చేయించడంలో సఫలమయ్యారు.

● బీటీ రోడ్ల టెండర్లు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దూలూరు నుంచి పోసానిపేటకు రూ. 3 కోట్లు, చింతకుంట - కథలాపూర్ బీటీ రోడ్డుకు రూ. 2 కోట్లు, భూషణరావుపేట నుంచి కథలాపూర్‌కు రూ. 6 కోట్లతో డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు కాగా టెండర్లు కూడా జరి గాయి. ఈ పనులకు శంకుస్థాపన కూడా చేసినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముం దుకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక టెండర్లు రద్దు కాగా ఆ కాంట్రాక్టర్లతోనే పను లు పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కోరడంతో టెండర్లు పునరుద్ధరించుకున్నట్లు తెలిసింది.



అంబారిపేట తండాలో రోడ్డు రోలర్‌తో చదును చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే కృషితో పనుల్లో కదలిక

- జవ్వాజి రవి, అంబారిపేట



రెండేళ్లుగా నిలిచిపోయిన పనుల్లో ఎమ్మెల్యే క దలిక తీసుకు రావడం శుభపరిణా మం. పెండింగ్ పనులన్నింటిని పూర్తి చేస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతా యి. అధికారులు త్వరగా పూర్తి చేసేం దుకు చర్యలు తీసుకోవాలి.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు


వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి శ్రీ రామలిం గేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో శుక్రవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూ పరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకులు బొజ్జ సంతోష్‌కుమార్, ద్యా వళ్ల విశ్వనాథం, సాయికుమార్, స్థానిక వేదపండితులు మదు రామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

'నాగోబా'కు కమ్మునూర్ గోదావరి జలాలు

బీర్‌పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మునూర్ కలమడుగు బ్రిడ్జి సమీపంలోగల గోదావరి నది ప్రాంతంలో మెస్రం వంశీయులు శుక్రవారం గోదావరి జలాన్ని ప్రత్యేకమైన ఝరిలో సేకరించి నాగోబా జాతరకు బయలు దేరారు. మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న నాగోబా దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ నెల 28న మహాపూజతో నాగోబా జాతర బ్రహ్మోత్స వాలు ప్రారంభం కానున్నాయి. మెస్రం వంశీయులు పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ ఆధ్వర్యంలో మెస్రం వంశీయులు శుక్రవారం ఉదయం కలమడుగు గోదావరి రేవులోని అత్తమడుగు ప్రాంతానికి చేరుకొని గంగాజలాలు సేకరించారు. కాలినడకన పాదయాత్రగా కేస్లాపూర్‌కు పయణమయ్యారు.


కాళినడకన బయలుదేరిన మెస్రం వంశీయులు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు


విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మేక రమేశ్‌బాబు

గణేశ్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కరీంనగర్ టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు సూచించారు. జిల్లా కేంద్రంలోగల టీజీఎన్‌పీ డీసీఎల్ సమావేశ మందిరంలో కరీంనగర్ సర్కిల్ డీఈలు, ఏడీలు, ఏఈలు, ఎస్ఐవో, ఏవోలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రమే శ్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ వినియోగ దారులకు నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. వేసవి కాలంలో తీసుకో వాల్సిన జాగ్రతలపై పలు సూచనలు చేశా రు. అగ్రికల్చర్ సర్వీసెస్ తొందరగా రిలీజ్ చేయాలన్నారు. ఇంటర్ లింకింగ్ లైన్స్ ఆర్ఎం అతిత్వరలో పూర్తి చేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. సంబంధిత సిబ్బందికి తగిన శిక్షణ తరగతులను కూడా నిర్వహించి తగు జాగ్రత్తలను పాటించాలన్నారు. వర్క్ ఆర్డర్లు తొందరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, రాజాం, తిరుపతి, లక్ష్మారెడ్డి, కాళిదాసు, రమణారెడ్డి, ఏడీలు, శ్రీనివాస్ లావణ్య, నరేందర్, కిరణ్, ఏఈలు, ఏవోలు తదితరులు పాల్గొన్నారు.

● వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

వచ్చే వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు ముం దస్తు చర్యలు చేపట్టారు. నాణ్యమైన నిరం తర విద్యుత్ సరఫరా చేసేందుకు కరీంనగర్ టౌన్ వన్ సెక్షన్‌లో మూడు 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, టౌన్ 3 సెక్షన్‌లో ఒక 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛార్జ్ చేశారు. కార్య క్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ మేక రమేష్ బాబు, డివిజనల్ ఇంజినీర్ జంపాల రాజం, ఏడీఈ టౌన్‌వన్ పంజాల శ్రీనివాస్‌గౌడ్, టౌన్ వన్, టౌన్ టు, ఏఈలు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దు కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానం రద్దు కోసం విద్యా ర్థులు ఉద్యమించాలని ఏఐ ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసి రెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జాతీ య నూతన విద్యా విధానం రద్దును విద్యార్థులు వ్యతిరే కించాలనాన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు కేటాయిం చాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయి లను వెంటనే విడుదల చేయాలన్నారు. కరీంనగర్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రావణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల స్వామి

పెద్దపల్లిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా కేంద్రం తెలంగాణ చౌక్‌లో ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్య మకారులు దివంగత గద్దర్ విగ్రహం ఏర్పా టు చేయాలని గద్దర్ గళం రాష్ట్ర ఉపాధ్య క్షుడు, గద్దర్ విగ్రహ కమిటీ చైర్మన్ గజ్జెల స్వామి డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం కళాకారులు, రచయి తలు, అభిమానులతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజాయుద్ధ నౌకగా పేరొంది, అనునిత్యం తన ఆట పాటల ద్వారా ప్రజల పక్షాన పోరాడిన గద్దర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల న్నారు. గద్దర్ విగ్రహ ఏర్పాటులో భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చారు. ఈసంద ర్భంగా వివిధ అంశాలపై సదస్సులో చర్చించారు. ముఖ్య సలహాదారు కొరివి వేణుగోపాల్, న్యాయవాది పూరెళ్ల రాములు, విగ్రహ కమిటీ కన్వీనర్ మేడి అంజన్న, కోకన్వీనర్లు మసాల స్వామన్న, తగరం శంకర్‌లాల్, జాదవ్, పెరుక రాజన్న, పెద్దపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బొల్లం మల్లేశం, కోఇన్‌చార్జి ఏట రవి, ఆసం తిరుపతి, గుల్ల రాజు, తదితులు పాల్గొన్నారు.

నారసింహా.. నదీస్నానం గగనమేనా..


ధర్మపురి గోదావరి వద్ద పేరుక పోయిన చెత్తా చెదారం

● దుర్గంధంగా మారిన గోదావరి నది
● నదిలో కలుస్తున్న మురికి కాలువ నీరు
● పరిశుభ్రత లోపం-భక్తుల ఇక్కట్లు

ధర్మపురి, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద పరిశుభ్రత లోపించింది. దీంతో నిత్యం దూర ప్రాంతాల నుంచి తరలి వస్తున్న భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. దక్షిణ దిశగా ప్రవహిస్తున్న ధర్మపురి గోదావరి నదికి ఎంతో ప్రత్యే కత ఉంది. ఈ నదిలో స్నానాలు ఆచరించడం కోసం నిత్యం దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఏడాదిలో శ్రావణ, కార్తీక, మార్గశిర, పుష్య, మాఘ మాసాలతో పాటు శుభ దినా లు, ప్రతి బుధ, శుక్ర, ఆదివారాల్లో భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు నదీ తీరాన గల ఆలయాలతో పాటు లక్ష్మీ నరసింహ స్వామి ఆల యాలను సందర్శిస్తారు. కొందరు భక్తులు గంగమ్మ మొక్కులు, తెప్పె మొక్కులు, కేశ ఖండనాలు జరిపి నది వద్దనే కోళ్లు, మేకలు కోసి వంటలు చేసుకుని భోజనం చేసి తిరిగి వెళుతుంటారు. ఇటీవల కాలంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల ధర్మపురి వద్ద గోదావరి నది నిండు కుండలా మారింది.

● అపరిశుభ్రంగా మారిన నది

ధర్మపురి గోదావరి నది వద్ద కుక్కలు, కోతులు, పందులు సంచరించడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. నిత్యం భక్తులు స్నానాలు చేసిన అనంతరం స్నానఘట్టాల పైన ప్రత్యేక పూజలు చేస్తుంటారు. భక్తులు కొబ్బరి ముక్కలు, ప్లాస్టిక్ కవర్లు, అగర్‌బత్తీల ప్యాకెట్లు, ఖాళీ సీసాలు, దుస్తులు అక్కడే వదిలి వే యడంతో కుక్కలు, పందులు వీక్కుతినడం వల్ల అపరిశుభ్రంగా మారుతోంది. అలాగే భక్తులు వంటలు చేసుకుని వాటికి వాడే కాలిపోయిన కట్టెలు, ఇంగిలి విస్తర్లు, డిస్పోజబుల్ గ్లాసులు, పిండ ప్రదానం కోసం వాడిన పదార్థాలు, పాత దుస్తులు, దీక్షా వస్త్రాలు, దేవుళ్ల ఫొటోలను కూడా అక్కడే వదిలి వెళ్తున్నారు. భక్తులు మున్సిపాలిటీ పక్షాన ఏర్పాటు చేసిన చెత్త కుండీలను సక్రమంగా వాడటం లేదు. నదీ ప్రాంతంలో చెత్తా చెదారాన్ని తొ లగించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో సరి పోవటం లేదు. నదీ తీరాన సమీపంలో గల మూత్రశాలలు భక్తులు వినియోగించుకోవడం లేదు. ఖాళీ ప్రదేశాల్లోనే మల, మూత్ర విసర్జన చేయడంతో దుర్గంధంగా మారుతోంది. అధికా రుల స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

● గోదావరిలో కలుస్తున్న మురికి నీరు

గోదావరి నదిలో మురికి కాలువల ద్వారా నీరు కలుస్తోంది. ధర్మపురిలోని వివిధ వీధు లకు చెందిన మురికి కాలువల ద్వారా వచ్చే నీరు నదిలో కలవడం వల్ల పూర్తిగా కలుషి తమం అవుతోంది. కర్నె అక్కపల్లి కల్యాణ మంటపం, సాయిబాబా గుడి పక్కల నుంచి వచ్చే మురికి నీరుతో పాటు బోయవాడ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురికి నీరు గోదావరిలో కలుస్తోంది. దీంతో స్నానఘట్టా లను ఆనుకుని ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రవాహం లేక పూర్తిగా దుర్గంధంగా మారింది. భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. స్నానఘట్టాల వద్ద స్నానాలు చేయడం వల్ల ఆ పరిసర ప్రాంతాలు బురదగా మారి మెట్ల పైన పాకు రు పట్టి ఉండడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం పారిశుధ్య సిబ్బందిని అధికంగా నియమించి, సక్రమంగా నిర్వహణ చేస్తే కొంత వరకు సమస్య తొలగి పోయే అవకాశం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.


స్నానఘట్టం సమీపంలో చెత్తా చెదారం

గోదావరి నది వద్ద అపరిశుభ్ర వాతావరణం



- ముప్పారపు శేఖర్, భక్తుడు, మల్యాల

గోదావరి నది మెట్ల పైన కుక్కలు, కోతులు, పందులు సంచరించడం వల్ల పూర్తిగా దుర్గంధంగా మారింది. గతంలో నది స్నానం కోసం వస్తే మెట్లు ఎంతో శుభ్రంగా అగుపించాయి. భక్తులు తిని, తాగి పడేసిన వా టితో చెత్తా చెదారం పేరుకుపోయింది. గోదావరి అపరి శుభ్రంగా ఉండడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

నది స్నానం చేయలేకపోతున్నాం



- మామిడిపెల్లి మౌనిక, భక్తురాలు, జగిత్యాల

గోదావరి నదిలో స్నానం చేయాలంటే బాధ అనిపిస్తుంది. స్నానఘట్టాల పైన ఎక్క డ చూసినా చెత్త పేరుకుపోయి ఉంది. ఎం తో దూరం నుంచి నమ్మకంతో వచ్చి భక్తులు స్నానాలు చేస్తుంటారు. కాబట్టి పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలి. మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం కారణంగా తెలుస్తోంది.

చెత్తా చెదారాన్ని తొలగిస్తాం..

- కందుకూరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి

ధర్మపురి గోదావరి నది వద్ద చెత్తా చెదారాన్ని తొలగించ డం కోసం మున్సిపాలిటీ పక్షాన పారిశుధ్య సిబ్బందిని నియమించాం. భక్తులు అధికంగా వచ్చిన సమయంలో సి బ్బందిని కూడా ఎక్కువగా నియమించి పనులు చేయిస్తు న్నాం. మున్సిపాలిటీ పక్షాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చెత్తా చెదారాన్ని తొలగించి ట్రాక్టర్ ద్వారా దూర ప్రాంతాలకు తరలిస్తున్నాం.

భక్తజనసంద్రంగా రాజన్న ఆలయం


భక్తులతో రద్దీగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వ రస్వామి ఆలయం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయా నికి తరలివచ్చారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు రాజ రాజేశ్వరస్వామిని దర్శించు కున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లింప నకు సుమారుగా రెండుగంటల సమ యం పట్టిందని భక్తులు తెలిపారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో భక్త లు పూజలు చేశారు. బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో శ్రీకాంత్ ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● మండల శివదీక్షలు ప్రారంభం

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మండల శివదీక్షలు ప్రారంభమయ్యాయి. రాజన్న ఆలయంలోని అభిషేక మండలంలో ఉదయం తెల్లవారు జామున అర్చకులు నందగిరి భాను శర్మ, శంకరయ్య శర్మ, వాసాల మరి గోపి, తమ్మల భీమన్న శివదీక్షాపరులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మాలాధారణ చేశారు. గురుస్వాములు, మచ్చకిషన్, రాపెల్లి శ్రీధర్, గుంటి కనుకయ్య, ఉప్పల రవి, మ్యాన శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● అన్నదానం.. మహాదానం

అన్నదానం మహాదానమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని పార్వతి రాజరాజేశ్వర శివదీక్ష సేవా సమితి ట్రస్ట్ అదనపు భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న భక్తుల ని మిత్తం అదనపు భవనం నిర్మించడం చాలా సంతో షకరమన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామ తీర్థపు మాధవి, కనికరపు రాకేష్ ఉన్నారు.

కిలిమంజారో పర్వతాధిరోహణ

● రెండోసారి ఘనత సాధించిన ఎక్సైజ్ కానిస్టేబుల్



కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన ఎక్సైజ్ కానిస్టేబుల్ లెంకల మహిపాల్ రెడ్డి (బ్లూ జెర్కిన్)

కరీంనగర్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెంది న ఎక్సైజ్ కానిస్టేబుల్ లెంకల మహిపాల్ రెడ్డి జనవరి 16న ఆ ఫ్రికా ఖండంలోనే అత్యంత ఎతైన పర్వతాన్ని అధిరోహించాడు. మహి పాల్‌రెడ్డి ఇదివరకే 2019లో ఈ శిఖరాన్ని అధిరోహించాడు. మౌంట్ కిలిమంజారో పర్వతాన్ని అధిరో హించిన మహిపాల్‌రెడ్డి అక్కడ సే నోటు డ్రగ్స్ అనే బ్యానర్‌ని ఆవిష్క రించాడు. యువత మత్తు పదా ర్థాలకు బానిస కాకూడదని తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన సే నో టు డ్రగ్స్ అనే కార్యక్రమంలో భాగంగా యువత మాదక ద్రవ్యాలకు మత్తు పదార్థాలకు బానిస కావద్దు అని నచ్చిన రంగంలో కృషి చేసి రాష్ట్ర, దేశ పేరు ప్రతిష్ఠలను పెంచాలని మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. రెండవసారి మౌంట్ కిలిమంజారోని అధిరోహిం చిన తొలి తెలంగాణ వ్యక్తిగా గుర్తింపు పొందారు. శిఖర అధిరోహణకు సహకరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిపార్టుమెంట్‌కు మహిపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శనివారం నుంచి త్యాగరాజస్వామి ఆరాదనోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.ఉదయం 6 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, 7.25 గంటలకు నగర సంకీర్తన అనంతరం 9 గంటలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాలకు రాజన్న ఆలయం ఆవరణ లోని ఓపెన్‌స్లాబ్‌లో సభ వేదిక సిద్ధం చేసినట్లు ఈవో వినోద్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ ఎస్.నర్సయ్య త్యాగరాజస్వామి జీవిత విశేషాలను, 10.30 గంటలకు శ్రీవిద్య బృందం పంచరత్న గానం, సాయంత్రం 4.30 గంటలకు కృష్ణవేణి సంగీత కచేరి, 5.30 గంటలకు అభిరాం ఆధ్వర్యం లో వైలన్ సోలో కచేరి, 6.30 గంటలకు ప్రియ సిస్టర్స్ శాస్త్రీయ సంగీత కచేరి, రాత్రి 8 గంటలకు భోగ ధర్మరాజు బృందం కూచిపూడి నృత్యం, 9 గంటలకు జయంతి భాగవతారణి హరికథ వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.


రాజన్న ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సభా వేదిక

ఆకట్టుకున్న తెప్పల పోటీలు

● ఉత్సాహంగా పాల్గొన్న యువకులు


తెప్పల పోటీలకు సిద్ధంగా ఉన్న క్రీడాకారులు

వేములవాడ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరంలో మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తెప్పల పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది గ్రామాల నుంచి క్రీడాకారులు పోటీపడ్డారు. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో కిలోమీటరు దూరంలో లక్ష్యాన్ని నిర్దేశించారు. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో పోటీలు నిర్వహించడంతో వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన తునికి రఘు మొదటి స్థానంలో, నాంపల్లికి చెందిన కూన కుమార్ ద్వితీయ, రుద్రవరం గ్రామానికి చెందిన పండుగ వంశీ తృతీయ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకుడు తునికి నరేష్ తెలిపారు. విజేతలకు మత్స్యకార్మిక సంఘం ఆధ్వర్యంలో నగదు బహుమతి అందజేసినట్లు చెప్పారు.


తెప్పల పోటీలను వీక్షించేందుకు తరలివచ్చిన జనం


తెప్పల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మున్సిపాలిటీల్లో చురుగ్గా సర్వే

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 21,22 తేదీల్లో వార్డు సభలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 26న కొత్త రేషన్‌కార్డులను, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మున్సిపాలిటీల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. వార్డు సభ తర్వాత తమ స్వంత ఇంటి కల నేరవేరుతుందని, కొత్త రేషన్‌కార్డులు వస్తాయని పలువురు దరఖాస్తుదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

● దరఖాస్తుదారుల్లో ఆందోళన

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి దర ఖాస్తులను స్వీకరించింది. గత కొన్నేళ్లుగా ఇళ్లు, రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ప్రజాపాలనలో వెల్లువలా దరఖాస్తు చేసుకున్నారు. కొందరి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, మరికొందరి దరఖాస్తులను నమోదు చేయకుండా వదిలిపెట్టారు. కొంత మంది ఆధార్ నంబర్లను నమోదు చేయకపోవడం, ఒక చోట ఉంటూ మరో చోట దరఖాస్తు చేసుకోవడం వంటి కారణాలతో చాలా మంది అర్హులైన వారి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 60 డివిజన్లలో డివిజన్‌కు కనీసం 100 చొప్పున దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారని, నగరంలో 6 నుంచి 8వేల వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని తెలిసింది. దీంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అనేక మంది అర్హులైన పేదలు తమ దరఖాస్తులను సర్వే చేయలేదని, దీంతో ఇందిరమ్మ ఇళ్లు కొత్త రేషన్‌కార్డులు ఇస్తారో లేదోనని ఆందోళన చెందుతున్నారు. చాలా మంది దరఖాస్తుదారులు కార్పొరేటర్లు, కార్యాలయాల చుట్టూ తిరిగి తమ పరిస్థితి ఏమిటని, సర్వే చేయకుంటే మాకు లబ్ధిచేకూరదా, మళ్లీ తమ దరఖాస్తులు ఎప్పుడు తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. అయితే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ప్రజల్లో సందేహం వ్యక్తం అవుతోంది. సర్వే పూర్తయిన వారికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తే మళ్లీ తమకు ఎప్పుడిస్తారంటూ సర్వేలో పేరు రాని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్నప్పటికీ తమకు న్యాయం జరుగడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని కోరుతున్నారు.

తమిళ కవి జననేసన్ వీరరాఘవన్ మృతి

- కరీంనగర్‌తో ఆత్మీయ అనుబంధం

- పలువురు కవులు, రచయితల సంతాపం



కరీంనగర్ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గతంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆర్‌వీ కర్ణన్ తండ్రి, ప్రముఖ తమిళ కవి జననేసన్ రాజగోపాల వీరరాఘవన్ శుక్రవారం హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. జననేసన్ ఆయన కలంపేరు. తమిళనాడు కరైకుడికి చెందిన ఆయన అలగప్ప గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ప్రగతిశీల రచయితల సంఘంలో ప్రధాన బాధ్యునిగా ఉన్నారు. సుమారు 20కిపైగా కథలు, నవలలు, హైకూల పుస్తకాలు రాశారు. ఆయన తండ్రి తెలుగువారు. తమిళనాడుకు తరలివెళ్లారు. వీరరాఘవన్‌కు కరీంనగర్‌తో ఆత్మీయ సాహితీ అనుబంధం ఉంది. ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఖాతాదారులకు బీమా వర్తింపజేయడం అభినందనీయం: మేయర్

కరీంనగర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గాయత్రి బ్యాంకు ఖాతాదారులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తూ మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం అభినందనీయమని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బ్యాంకు ఖాతాదారుడు ఆకుల కొండయ్య ప్రమాదవశాత్తు మృతిచెందగా ఆయన కుమార్తె ఆకుల అనూషకు గాయత్రీ నిర్భయ సేవింగ్ ఖాతా వర్తింపజేస్తూ లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును మేయర్ సునీల్‌రావు చేతుల మీదుగా అందజేశారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ గొట్టె అశోక్ మాట్లాడుతూ రైతులకు 10.5 శాతంతో వ్యవసాయ రుణాలను అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకు సేవలను విస్తరించేందుకు బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించి పెన్షనర్లు, ఇతర ఖాతాదారులకు సేవలందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు జూనియర్ ఆఫీసర్ ఉల్లెంగల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడు..?

మాతా శిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతో పాటు ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు వయసున్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాగా పలు కేంద్రాల్లో అరకొర వసతులతో గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

» అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు » అరకొర వసతులతో అవస్థలు



అద్దె భవనంలో కొనసాగుతున్న కేంద్రం

మానకొండూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. కొన్ని కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం 50 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 14 కేంద్రాలకు సొంత భవనాలు లేవు. మానకొండూర్ క్లస్టర్‌లో 27అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 350 మంది పిల్లలు ఉన్నారు. ఈ కేంద్రాల పరిధిలో 190 మంది బాలింతలు, 200 మంది గర్భిణులు సేవలు పొందుతున్నారు. చెంజర్ల క్లస్టర్‌లో 23 అంగన్‌వాడీ కేంద్రాల్లో 390 మంది పిల్లలు, 144 మంది బాలింతలు, 142 మంది గర్భిణులు ఉన్నారు. మానకొండూర్‌లోని 1, 3, వెల్ది 1, జగ్గయ్యపల్లి, లింగాపూర్, గొల్లపల్లి, అన్నారం 2, ముంజంపల్లి, కొండపల్కల-1, గంగిపల్లి 2,3, గట్టుదుద్దెనపల్లి 2, ఖాదర్‌గూడెం, శంషాబాద్ మొత్తం 14 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మానకొండూర్‌లోని బంజేరుపల్లి, లింగాపూర్ గ్రామాల్లో రెండేళ్లుగా అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వం నియ మించడం లేదు. సదాశివపల్లి, పచ్చునూర్-1, 2, మానకొండూర్‌లోని 2, 3, జగ్గయ్యపల్లి, దేవంపల్లి- 2, ఊటూర్ -2, కొండపల్కల -3, గట్టుదుద్దెనపల్లి -2, రంగపేట, ఖాదర్‌గూడెం, పోచంపల్లి, మద్దికుంట, ఖాదర్‌గూడం, గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఆయాలు లేకుండా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీం

కరీంనగర్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శలు చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అజీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు ప్రాధాన్య క్రమంలో అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం వ్యయప్రయాసాలకు ఓర్చుకుని సంక్షేమ పథకాల అమలుకు కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికి ప్రజలు నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఇతర బీఆర్‌ఎస్ నాయకులు అర్థరహిత విమర్శలు చేస్తున్నారన్నారు. ఒక వైపు మాజీ మంత్రి కేటీఆర్‌ను ఈ-ఫార్ములా కార్ రేస్‌లో ఏసీబీ, ఈడీ అధికారులు విచారిస్తుంటే ఆయన కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అంటుండటం హాస్యాస్పదమన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయకుండా ప్రభుత్వ ఖజానాను మాత్రం కొల్లగొట్టిందని ఆరోపించారు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అజీం హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



లక్ష్మీగణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్ జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలయాల్లో శుక్రవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్ రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీ శంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో సబ్‌స్టేషన్ల నిర్వహణలో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1, 2 ఏడీఈలు, పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎం లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు కట్టరాంపూర్, వినాయకనగర్, గిద్దెపెరుమాండ్లు ఏరియా, గౌతమ్ నగర్, హనుమాన్‌నగర్, ప్రొఫెసర్ నగర్, తిరుమల నగర్, అల్కాపురికాలనీ, కోతిరాంపూర్, మెయిన్‌రోడ్, ఉజ్వల పార్క్ ఏరియా, గణేష్‌నగర్ బైపాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఐబీ చౌరస్తా ప్రాంతం,మానేరు హోటల్ ప్రాంతంలో ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు, వెంకటాద్రి కాలనీ, రామచంద్రాపూర్ కాలనీ, సాయిబాబా గుడి ప్రాంతం, అంజనాద్రి కాలనీ, లేక్ పోలీస్‌స్టేషన్, ఎర్రగుట్ట ప్రాంతం బైపాస్ రోడ్ ప్రాంతం, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, వాసుదేవ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ, కట్టరాంపూర్ ప్రాంతంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వావిలాలపల్లి, ఇందిరానగర్, రామాలయం, సవరన్ వీధి, డీఐజీ బంగ్లా, తేజ స్కూల్ ఏరియా, కోర్టు వెనుక వైపు, జ్యోతి నగర్, ఐబి ప్రాంతం, క్రిస్టియన్ కాలనీలో ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని

ప్రపంచ చెస్ చాంపియన్‌ను కలిసిన అనూప్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న దొమ్మరాజు గుకేష్, భారత మహిళల నంబర్ వన్ క్రీడాకారిణి కోనేరు హంపిని కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్, కరీంనగర్ జిల్లా డెమోక్రటిక్ చెస్ జిల్లా కార్యదర్శి కంకటి అనూప్ కుమార్ ఢిల్లీలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా అనూప్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండల ఆచంపల్లిలో 15లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు, నాలుగు హైమాస్ట్ లైట్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కీలకమైన రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట వేసి అవసరమైన చోట్ల నిధులు కేటాయించి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గంగాధర ప్రజా కార్యాలయంలో మండలంలో 90మంది లబ్ధిదారులకు మంజూరైన 28.50 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యం, ప్రమాదాలకు గురైన పేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, గంగాధర సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు తోట కరుణాకర్, పార్టీ అధ్య క్షుడు మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, రామిడి రాజిరెడ్డి, కంకణాల రాజ్‌గోపాల్‌రెడ్డి, గంగన్న, తాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీఏ మెంబర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాహుల్

కరీంనగర్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) మెంబర్‌గా నియామకమైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరీంనగర్‌కు చెందిన పడాల రాహుల్ కలెక్టర్ పమేలా సత్పతిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్టీఏ మెంబర్‌గా నియమితులైన అనంతరం మొదటిసారిగా కలెక్టర్‌ను చాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం గురించి, రవాణాశాఖకు సంబంధించి పలు అంశాలు, ప్రొటోకాల్ అంశాలపై కలెక్టర్‌తో చర్చించినట్లు ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడి అప్రజాస్వామికం

కరీంనగర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై దాడి అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని, దాడి చేసినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ఆక్రమణలపై చర్య తీసుకోండి

కరీంనగర్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోతిరాంపూర్, ఆటోనగర్‌లో రోడ్డు ఆక్రమణకు గురికాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కి శుక్రవారం ఫిర్యాదు చేశారు. కోతిరాంపూర్, ఆటోనగర్‌కు వెళ్లే 33 ఫీట్ల రహదారిపై కొంకటి హన్మాండ్లు అనే వ్యక్తి 15 రోజుల క్రితం బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్ వేసి దారి గుండా రాకపోకలు జరగకుండా అంతరాయం కలిగిస్తున్నాడని, ఈ రోడ్డును ఆక్రమించుకొని ఇంటి పర్మిషన్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసిందని కాలనీకి చెందిన స్థానికులు పలువురు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డు ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.

రేపు 'విశ్వంభరుడు' పరిచయ సభ

కరీంనగర్ కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన విశ్వంభరుడు కవితా సంకలన పరిచయాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు కెవి గోపాలాచార్య ఒక ప్రకటనలో తెలిపారు. సినారె రాష్ట్ర స్థాయి పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరణ చేస్తారని, అన్నాడి గజేందర్‌రెడ్డి పుస్తక పరిచయం చేస్తారని పేర్కొన్నారు.

● సంక్షిప్తం..

హుజూరాబాద్: పట్టణంలో అఖిల భారత యాదవ మహాసభ క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు నాగరం సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బద్దుల రాజ్‌కుమార్, మక్కపల్లి కుమార్, బండి రమేష్, కన్నబోయిన మహేందర్, బెల్లి రాజయ్య, రాములు, ప్రశాంత్, సంపత్, రమేష్, శ్రీనివాస్, శంకర్, అయిల య్య, సమ్మయ్య, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

- పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ యూత్ నాయకులు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- టీడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ కొలిపాక శంకర్‌ను బీసీ రాష్ట్ర నా యకులు చందుపట్ల జనార్దన్, సందేల వెంకన్న సన్మానించారు. కార్యక్రమంలో సదానందం, వెంకటయ్య, లింగారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, నర్సింహచారి, రామకృష్ణ పాల్గొన్నారు.

- పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల 1980-82 బ్యాచ్ బైపీసీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎడవెల్లి సంజీవరెడ్డి, గోలి శ్రీనివాస్, అనుమాండ్ల ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ నివాస గృహంలో శుక్రవారం జిల్లా సగర ఉప్పర సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైదాపూర్: ఘనపూర్ గ్రామంలో అనారోగ్య కారణాలతో ఇటీవల చికిత్స చేయించుకున్న లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్మారెడ్డి, భువణచంద్ర, రాజు, శ్రీధర్, గణేశ్, జయపాల్‌రెడ్డి, ఆనందం పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైదాపూర్: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని టీబీ నోడల్ పర్సన్ రమేశ్ అన్నారు. ఎలబోతారం, రాములపల్లి, రాంచంద్రాపూర్ గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' సర్వే తనిఖీ

- నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయాలని డీఆర్‌డీవో సూచన





గోపాల్‌పూర్‌లో ఉపాధిహామీ కూలీల వివరాలను తెలుకుంటున్న డీఆర్‌డీవో శ్రీధర్, బొమ్మకల్‌లో సర్వే చేస్తున్న ఏఈవో స్వర్ణలత, రెవెన్యూ సిబ్బంది

కరీంనగర్ రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో మొగ్దుంపూర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేను డీఆర్‌డీవో శ్రీధర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏపీవో శోభారాణి, కార్యదర్శులు జయలక్ష్మి, శ్రావణి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే..

● కరీంనగర్ మండలంలో రైతు భరోసా సర్వే కొనసాగుతోంది. రెండోరోజు మండలంలోని ఎలబోతారం, ఇరుకుల్ల, ఆరపల్లి గ్రామాల్లో సర్వే ప్రారంభం అయింది. మండలంలోని వ్యవసాయేతర భూములైన ప్లాట్లు, ఇళ్ల స్థలాలతో పాటు, లేఅౌట్ చేసిన స్థలాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంపీడీవో సంజీ వరావు, తహసీల్దార్ రాజు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఏఈవోలు సర్వేను పరిశీలించారు.

మాదిగలు తరలిరావాలి

తిమ్మాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వెయ్యి గొంతులు, లక్ష డప్పుల కార్యక్రమానికి మాదిగలు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిసిల్ల శంకర్, సిరిసిల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి చేపట్టిన ప్రచార రథయాత్ర శుక్రవరాం అలుగునూరుకు చేరుకుంది. అ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రామంచ భరత్ హాజరయ్యారు. కార్యక్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, కళాకారుల జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రభు, బోయిని కొమురయ్య, ఖమ్మం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్



మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్

భగత్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దని బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కొత్తపల్లి మండల బీజేపీ కమిటీ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు కుంట తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వేముల అనిల్, మాజీ మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

● అభివృద్ధిపై దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకుల హితవు

హుజూరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాహుల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. మొదట గాడిదపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తరుచూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను ఇష్టానుసారంగా దుర్భషలాడుతున్నారన్నారు. సోషల్ మీడియాలో తరుచూ కనబడాలనే ఉద్దేశ్యంతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా ఇలా ప్రవర్తించడం సరికాదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల జోలికి వస్తే కౌశిక్‌రెడ్డిని నియోజకవర్గంలో తిరుగకుండా అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి కిరణ్, కొలిపాక శంకర్, పుష్పలత, నాగరాజు, సుశీల, కిరణ్‌రెడ్డి, శ్రీనివాస్, రాధ, తిరుమల, లావణ్య, రాకేష్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగించాలి

హుజూరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముస్లిం షాదీ ఖానా ఆవరణలో ఉన్న చెత్తాచెదారం తొలగించాలని, లైట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు జామే మజీద్ ఈద్గా ఖబ్రస్థాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు హబీబ్, ఫయాజుద్దీన్, యాసిన్‌ఖాన్, రీసెట్ అలీ, హర్షత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జోలికొస్తే ఊరుకోం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ దళిత నాయకులు

గంగాధర, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకుల జోలికొస్తే ఊరుకునేదిలేదని ఆపార్టీ దళిత నాయకులు అన్నారు. గంగాధరలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అనుచరులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. సమావేశంలో మల్లయ్య, అజయ్, దుర్గయ్య, శివశంకర్, లింగయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని దుద్దెనపల్లిలో శుక్రవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ నిబంధనల ప్రకారం రేషన్ కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే 90లక్షల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. వ్యవసాయం చేసే భూములకు రైతు భరోసా అందుతుందన్నారు. భూమి లేని వారికి రూ. 12వేలు, గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, సింగిల్‌విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు డు మిట్టపెల్లి కిష్టయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా అధికార ప్రతినిధి మ్యాకల రవిందర్, నాయకులు సంతోష్, యాదగిరి పాల్గొన్నారు.

● మంత్రి పరామర్శ

సైదాపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరామర్శించారు. దుద్దెనపల్లి గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పొన్నం మహేందర్, వెన్నంపల్లిలో మృతి చెందిన పేరాల శ్రీకాంత్ రావు, సోమారంలో మృతి చెందిన పిట్టల లక్ష్మి కుటుంబాలను పరామర్శించారు.

చిగురుమామిడి: మండ లంలోని నవాబుపేట, బొమ్మనపల్లి, సుందరగిరి, ఇందుర్తి గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు సత్యనారాయణరెడ్డి, చిట్టుమల్ల రవీందర్, రాములు, పోలు స్వప్న, శ్రీనివాస్, బారతిదేవి తదితరులు ఉన్నారు.